క్లుప్తంగా

రోడ్డు నిర్మాణానికి చర్యలు



సర్వే చేయిస్తున్న డీఈఈ లోకనాథం

భామిని: మండలంలోని మూలగూడ నుంచి లివిరి సెంటరు వరకు రోడ్డు నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఆదివారం సర్వే చేసి, రోడ్డు కొలతలు వేశారు. మొత్తం 2.6 కిలోమీటర్ల మేర రోడ్డును రూ.1.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నట్లు పంచాయతీ రాజ్ డీఈఈ డి.లోకనాథం తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

పార్వతీపురం టౌన్: మండలంలోని డోకిశీల గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థి కొండగొర్రి శంకరరావు ఈనెల 2వ తేదీన విద్యార్థులతో కలిసి ఆడుకుంటూ భవనం పైనుంచి జారిపడి గాయపడ్డాడు. వార్డెన్ రమేష్ విద్యార్థిని ఆ రోజే సమీపంలోని పీహెచ్‌సీకు తరలించి, ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్, సహాయ కార్యదర్శి హరికృష్ణ, నాయకులు వికాస్, తదితరులు ఆదివారం పరామర్శించారు. విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు.

ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి

- ముగిసిన ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు

పార్వతీపురంటౌన్: ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల పై ఉందని, దాన్ని పక్కదారి మళ్లించి కార్పొరేట్ విద్యను ప్రోత్సహిస్తూ కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఏ.అశోక్ విమర్శించారు. స్థానిక ఏపీ ఎన్జీఓ హోంలో రెండు రోజులపాటు నిర్వహించిన ఎస్ఎఫ్ఐ పార్వతీపు రం మన్యం జిల్లా 32వ మహాసభలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రభుత్వ విద్యను కాపాడుకోవాలని, అందుకోసం సమరశీల పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యారంగానికి బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలని, ఉపకార వేతనాల బకాయిల ను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశా రు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా సంక్షేమ హాస్టళ్లలో మెస్ చార్జీలు నెలకు రూ.3వేలు పెంచాల ని, జీఓ నెంబర్ 77 రద్దు చేసి పీజీ విద్యార్థులందరి కీ స్కాలర్‌షిప్ ఇవ్వాలన్నారు. మధ్యాహ్న భోజనం పథకం అక్షయ పాత్రకి ఇవ్వడం వల్ల విద్యార్థులకు సరైన పౌష్టికాహారం అందదన్నారు. ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులు, సంక్షేమ హాస్టళ్లలో వర్కర్లు, ఏఎన్ఎంలను నియమించాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాల ని, పాలకొండ, పార్వతీపురం, కురుపాంలో పీజీ సెంటర్లు నెలకొల్పాలని, సంక్షేమ పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లకు సొంత భవనాలు కేటాయించాలని, కురుపాం ఇంజినీరింగ్ కాలేజీ పనులు త్వరగా పూర్తి చేయాలని, పార్వతీపురంలో మెడికల్, ఐటీఐ కళాశాలు ఏర్పాటు చేయాలని పలు తీర్మానాలను ఆమోదించారు.

17 మందితో జిల్లా కమిటీ ఎన్నిక

మహా సభల ముగింపు సందర్భంగా 17 మందితో పార్వతీపురం మన్యం జిల్లా ఎస్ఎఫ్ఐ నూతన కమి టీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా టి.అఖిల్, కార్యదర్శిగా కె.రాజు, ఉపాధ్యక్షులుగా కె.డేవిడ్, హెచ్.సింహాచలం, సహాయ కార్యదర్శిలుగా సంధ్య, సూర్యతో పాటు మరో 11 మందిని ఎన్నుకున్నారు.



అగ్నిమాపక కేంద్రం ఏర్పాటయ్యేనా?

- కలగా అగ్నిమాపక కేంద్రాల ఏర్పాటు
- వీరఘట్టం, సీతంపేట, భామినిల్లో కేంద్రాలు నిల్
- ప్రమాదాల్లో భారీగా ఆస్తి, ప్రాణనష్టం
- రెండేళ్లలో నియోజకవర్గంలో అగ్నిప్రమాదాలు 110
- రూ.3 కోట్ల మేర ఆస్తినష్టం



పాలకొండలోని అగ్నిమాపక కేంద్రం వద్ద ఉన్న అగ్నిమాపక శకటం

వీరఘట్టం:

పాలకొండ నియోజకవర్గంలోని సీతంపేట, భామిని, వీరఘట్టం మండలాల్లో అగ్నిమాపక కేంద్రాల ఏర్పాటు కలగానే మిగిలింది. ఆయా ప్రాంతాల్లో ఇంతవరకు ఏ ఒక్కచోట అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరిగేటప్పుడు సకాలంలో అగ్నిమాపక వాహనం రాకపోవడంతో దూరప్రాంతాల నుంచి వాహనం వచ్చేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. ఈ నేపథ్యంలో ఆయా మండలాల్లో ఏ ప్రాంతంలో అగ్నిప్రమాదం జరిగినా భారీగా ఆస్తినష్టం చవిచూడాల్సి వస్తోంది. వీరఘట్టంలో అగ్నిప్రమాదం జరిగితే సమీపంలోని పాలకొండ అగ్నిమాపక కేంద్రం నుంచి వాహనం రావాల్సి ఉంటుంది. భామినిలో అగ్నిప్రమాదం జరిగితే సమీపంలోని కొత్తూరు నుంచి అగ్నిమాపక వాహనం రావాల్సి ఉంటుంది. సీతంపేటలో ప్రమాదం జరిగితే కొత్తూరు, పాలకొండల నుంచి అగ్నిమాపక శకటం రావాల్సి ఉంటుంది. అయితే ఎక్కడైనా అగ్నిప్రమాదాల వద్దకు ఆ వాహనాలు వచ్చేసరికే అక్కడి పూరిళ్లు, పెంకిటిళ్లు, వరిగడ్డి కుప్పలు, టింబరు షాపులు పూర్తిగా దగ్ధమవుతున్నాయి. రూ.కోట్లలో ఆస్తినష్టం సంభవించి, బాధిత కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి.

ఇదీ పరిస్థితి..

పాలకొండ నియోజకవర్గంలోని 146 గ్రామ పంచాయతీలు ఉండగా, వాటి పరిధిలో మొత్తం 622 గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో డాబా, పెంకు, రేకు, పూరిళ్లు అన్నీ కలిపి దాదాపు 68 వేల వరకు ఉంటాయి. గత రెండేళ్లలో నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 110 అగ్నిప్రమాదాలు సంభవించాయి. ఈ ప్రమాదాలు జరిగిన ప్రతీసారి సకాలంలో అగ్నిమాపక వాహనం ప్రమాద ప్రదేశానికి చేరుకోలేకపోవడంతో ప్రజలే మంటలు ఆర్పివేసేందుకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. ఆ తర్వాత సమీప కేంద్రం నుంచి అగ్నిమాపక శకటం వచ్చేలోపు నష్టమే మిగులుతోంది. గత రెండు సంవత్సరాల కాలంలో అగ్నిప్రమాదాల రూపంలో మొత్తం రూ.3 కోట్ల మేర ఆస్తినష్టం జరిగినట్లు అధికారిక గణాంకాలు తెలియజేస్తున్నాయి.

హామీలే తప్ప నెరవేర్చడం లేదు..

ప్రతి ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల సమయంలో నాయకులు ఓట్లు కోసం వీరఘట్టం, సీతంపేట, భామిని మండలాల్లో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీలు ఇవ్వడమే తప్ప వాటిని నెరవేర్చిన దాఖలాలు లేవు. అధికార పార్టీల నాయకులు, మంత్రులు తమ ప్రాంతాలకు వచ్చినప్పుడు అక్కడి ప్రజలు తప్పకుండా అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని అభ్యర్థిస్తూ వినతిపత్రాలు సమర్పిస్తున్నారు. అయినా వారి కల నెరవేరడం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి, అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని ఆయా మండలాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏటా రూ.లక్షల్లో నష్టం..



వీరఘట్టంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాల్సిన అవసరం చాలా ఉంది. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఏటా అగ్నిప్రమాదాల్లో రూ.లక్షల ఆస్తినష్టం జరుగుతోంది. ఎన్నిసార్లు నేతలను కలిసినా ప్రయోజనం ఉండడం లేదు. ఇప్పటికైనా ప్రభు త్వం స్పందించి, అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి.

–పొట్నూరు లక్ష్మణరావు, వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు, వీరఘట్టం మండలం

ప్రాణాలు పోతున్నా.. పట్టించుకోరా?



ఏటాఅగ్నిప్రమాదాల్లో ఎన్నో జీవాలు, ఒక్కోసారి మనుషులు కూడా చిక్కుకుని చనిపోవడం జరుగుతోంది. ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..కనీసం నష్టం జరిగినప్పుడు చిల్లిగవ్వ కూడా ఇవ్వడం లేదు. ముఖ్యంగా జీవాలు, వరి గడ్డికుప్పలు కాలిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వెంటనే అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి. ప్రమాదాలు నివారించాలి.

–కర్రి లీలాప్రసాదరావు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి, నడుకూరు, వీరఘట్టం మండలం

మండలం	వీరఘట్టం	పాలకొండ	సీతంపేట	భామిని	మొత్తం
గ్రామ పంచాయతీలు	34	32	53	27	146
గ్రామాలు	63	45	456	58	622

దళారుల చేతిలో పత్తి రైతు దగా!



దళారుల చేతిలో పత్తి రైతులు దగాకు గురవుతున్నారు. సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ పత్తి దోపిడీ ఆగడం లేదు. దళారులు భయపెడుతున్నారో లేక ఏం ఆశ చూపుతున్నారో గానీ భామిని మండలంలోని గురండి, నులకజోడు, బిల్లుమడ, నేరడి-బి గ్రామాల్లోని రైతులంతా దళారులకే పత్తి విక్రయిస్తున్నారు. క్వింటాకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు రూ.వెయ్యి తగ్గించి మరీ దళారులు రైతుల నుంచి పత్తి కొనుగోలు చేస్తున్నారు. అయితే పత్తి పంటకు ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర, కొనుగోళ్లపై సరైన అవగాహన కల్పించకపోవడంతోనే రైతులు దళారులకు పత్తిని అమ్ముతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

–భామిని

గడ్డి వాముల దగ్ధం

పాలకొండ నగరపంచాయతీ పరిధిలోని ఏలాం జంక్షన్ వద్ద ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో పుర్రె దాలయ్యకు చెందిన గడ్డి వాములు(15 ఎకరాల్లోని గడ్డి) పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రమాద విషయం తెలిసిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని, మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. అయినా రూ.60 వేల విలువైన గడ్డ వాములు కాలిపోయాయని ఫైర్ ఆఫీసర్ సర్వేశ్వరరావు అంచనా వేశారు.

–పాలకొండ



కమ్మేస్తున్న పొగమంచు



భామిని మండలాన్ని పొగమంచు కమ్మేస్తోంది. రాత్రి 8 గంటల నుంచే మంచు కురవడం ప్రారంభమై, ఉదయం 9 గంటల వరకు ఉంటోంది. దట్టమైన పొగమంచు కారణంగా ఎక్కడ ఏ ప్రదేశం ఉందో కూడా కానరావడం లేదు. కనీసం ఎదురుగా వస్తున్న మనిషి కూడా మనకు దగ్గరగా వస్తే కానీ కనిపించని పరిస్థితి. దీంతో ఆయా సమయాల్లో అవసరాల నిమిత్తం బయటకు వెళ్లాల్సి వచ్చిన వారంతా లైట్లు వేసుకుని మరీ వెళ్లాల్సి వస్తోంది. మంచుతో పాటు చలితీవ్రత కూడా పెరగడంతో ఉదయం, రాత్రి వేళల్లో జనం చలిమంట కాగుతూ ఉపశమనం పొందుతున్నారు.

–భామిని

జవహర్ నవోదయ మోడల్ పరీక్షకు విశేష స్పందన



బహుమతులు పొందిన విద్యార్థులతో కరస్పాండెంట్ సరళకుమారి

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి కూడలిలో ఉన్న తిరుమల సాయి ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన జవహర్ నవోదయ మోడల్ పరీక్షకు విశేష స్పందన లభించింది. పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని 17 మండలాల నుంచి మొత్తం 400 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. ఈ నెల 18వ తేదీన జరగనున్న జవహర్ నవోదయ పరీక్షలో మంచి మార్కులు పొందేందుకు ఈ పరీక్ష దోహదం చేస్తుందని పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ రౌతు వెంకటరమణ తెలిపారు. మోడల్ పరీక్షలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన మండంగి కార్తికేయ, బోనెల భారతి, పొట్నూరు చైత్రలకు కరస్పాండెంట్ సరళకుమారి చేతులమీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవాలకు భామిని నాయకులు

భామిని: కాకినాడలోని పీఆర్ కళాశాలలో జరిగే యూటీఎఫ్(ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్) స్వర్ణోత్సవాల మహాసభలకు మండల యూటీఎఫ్ నాయకులు శ్రీకాకుళం రోడ్డు(ఆమదాలవలస) రైల్వేస్టేషన్ నుంచి శనివారం రాత్రి పయనమయ్యారు. ఆదివారం నుంచి మూడు రోజుల పాటు జరిగే సభల్లో పాల్గొని, యూటీఎఫ్ భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నారు. కాకినాడ వెళ్లిన వారిలో దండు ప్రకాశరావు, ఇ.తిరుపతిరావు, కె.ప్రసాద్ ఉన్నారు.



కాకినాడ బయలుదేరిన భామిని యూటీఎఫ్ నాయకులు

ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని చెముడుగూడకు చెందిన మృతుడు నిమ్మల రమేష్ కుటుంబానికి హైదరాబాద్‌లో స్థిరపడిన గ్రామానికి చెందిన బుడంకాయల శ్రీనివాసరావు ఆర్థికసాయం చేశారు. ఈ మేరకు గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు, హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు ఎం.దొరబాబు, టి.వినోద్‌లు బాధిత కుటుంబ సభ్యుల వద్దకు ఆదివారం వెళ్లి, దాత వితరణ చేసిన రూ.10 వేలను అందజేశారు. మండల కేంద్రంలోని హెచ్ గ్రౌండ్‌లో ఇటీవల జరిగిన గిరిజన సంప్రదాయ ఉత్సవమైన కందికొత్తలు పండగలో ప్రమాదవశాత్తు వేడి సాంబారులో పడి, రమేష్ మరణించిన విషయం తెలిసిందే.

పశు పోషణలో జాగ్రత్తలు పాటించాలి

గరుగుబిల్లి: శీతాకాలంలో పశు పోషణలో యజమానులు తగిన జాగ్రత్తలు పాటించాలని రావివలస అసిస్టెంట్ పశువైద్యాధికారి ఎం.శ్రీరాములునాయుడు సూచించారు. ఇదే విషయమై ఆదివారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. కొన్నిరోజుల నుంచి చలి తీవ్రత బాగా ఉందని, ఉష్ణోగ్రత తక్కువగా ఉంటే పశువులు ఒత్తిడికి గురవుతాయన్నారు. సాధారణంగా చల్లని వాతావరణంలో ఆవులు, గేదెలు పాలు తక్కువగా ఇస్తాయన్నారు. పాలదిగుబడి తగ్గకుండా ఉండడానికి రోజూ అందించే దాణాకు అదనంగా మరో 20 శాతం జోడించి పెట్టాలని తెలిపారు. అలాగే గాలి, సూర్యరశ్మి బాగా తగిలే ప్రదేశాల్లో పశువులను ఉంచాలన్నారు. పశువులు పడుకునే ప్రదేశం పొడిగా ఉండేలా చూడాలన్నారు. లేకపోతే శ్వాసకోశ సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. దూడలకు గోనెసంచులతో ఏర్పాటు చేసిన దుప్పట్లు కప్పాలన్నారు. ముఖ్యంగా చలికాలంలో పశువులకు మసూచి వ్యాధి సోకే అవకాశం ఉందని, గేదెల్లో కన్నా ఆవుల్లో ఈ వ్యాధి రావడానికి ఎక్కువ అవకాశం ఉందన్నారు. ఈ వ్యాధి బారినపడిన పశువుల పాదుగుపై పగుళ్లు ఏర్పడతాయన్నారు.



మేతకు వెళ్తున్న పశువులు(ఫైల్)

పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలి

తెర్లాం: ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి, తెర్లాం హైస్కూల్ సైన్స్ ఉపాధ్యాయురాలు ప్రసన్న అన్నారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో పుస్తక పఠనాన్ని విద్యార్థులు తప్పనిసరిగా చేయాలన్నారు. గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలు, వార్తా పత్రికలు చదవాలని సూచించారు. కార్యక్రమంలో నెమలాం హైస్కూల్ ఉపాధ్యాయుడు విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఆ కొండకూర రుచే వేరయా!


గంధమొవ్వుకూర



తుమ్మికూర



సారికూర



చీపురుకూర



ప్రకృతి అందాల సమాహారం సీతంపేట మన్యం. ఎన్నో వింతలు, విశేషాలతో పాటు గిరిజన సంప్రదాయం అందరినీ కట్టిపడేస్తోంది. గిరిజన ఆచార వ్యవహారాలతో పాటు నోరూరించే వారి వంటకాలు ఎంతో విశేషంగా ఆకట్టుకుంటాయి. ముఖ్యంగా అక్కడి కొండకోనల్లో సహజంగా లభ్యమయ్యే కొండకూర(ఆకుకూరలు)ల రుచి ఇష్టపడని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. మనం తినే తోటకూర, గోంగూర మాదిరిగానే వారికి అంటూ ప్రత్యేకంగా ఆకుకూరలు ఉన్నాయి. వాటినే వారు కొండకూరలుగా పిలుచుకుంటారు. పోషకాలు, విటమిన్లు పుష్కలంగా లభించే ఆ కూరలను విడిగా ఓసారి.. వేరే కూరల్లో మిశ్రమంగా మరోసారి వండుకుని తింటుంటారు. గిరి శిఖర గ్రామాల్లోని గిరిజనులు మైదాన ప్రాంతాలకు వెళ్లి, కూరలు కొనుక్కొని వెళ్లాలంటే చాలా కష్టమైన నేపథ్యంలో ఇలా సహజంగా దొరికే కొండకూరలు వారికి ఆరోగ్యం తెచ్చిపెడుతుండడంతో పాటు ఆదాయం మిగుల్చుతుండడం విశేషం.

–సీతంపేట



అడవిలో సేకరించి, ఇంటికి తీసుకువస్తున్న ఆకుకూరను చూపిస్తున్న గిరిజనుడు



ముళ్లుతోటకూర



కందములంకూర



బలుసుకూర

నాడీ వ్యవస్థ వ్యాధులపై ఆర్ఎంపీలకు అవగాహన సదస్సు

పార్వతీపురంటౌన్: నాడీ వ్యవస్థ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీ ణ వైద్యుల సంఘం సభ్యుడు, న్యూరో సర్జన్ డాక్టర్ రెడ్డి శంకరరావు అన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ప్రకాశం టౌన్ హాల్‌లో నాడీ వ్యవస్థ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదడుకు స్ట్రోక్ రెండు రకాలుగా భావిస్తారని ఒకటి రక్తం సరఫరా లో అంతరాయం, రెండవది అధిక రక్తస్రావం జరగ డం. రెండిటిలో నాలుగు గంటల వ్యవధిలో వైద్యం అందించినట్లయితే సాధారణ స్థితికి తీసుకురావచ్చన్నారు. బీపీ, మధుమేహం వంటి వ్యాధుల్లో మందులను అశ్రద్ధ చేయకూడదని తెలిపారు. సభ్యుల సంక్షేమం కోసం ఆగిన కమ్యూనిటీ పారామెడికల్ శిక్షణ తరగతులు పునఃప్రారంభించాలని ప్రభుత్వానికి కోరామన్నారు. తప్పనిసరిగా ప్రతి గ్రామీణ వైద్యుడు సంఘంలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విజయనగరం జిల్లా అధ్యక్షుడు గెద్ద చిరంజీవి, మన్యం జిల్లా ఇన్‌చార్జ్ అల్లాడ త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు.